ADMISSIONS ARE IN PROGRESS 2024-25
Secretary & Correspondent
Bikki Venkateshwarlu
M.Sc (Physicis), M.Ed.
Join your kids with us & Empower their Academic Excellence with Ethical Foundations
INDIRA VIDYALAYA
Nursery to VII class, English Medium
Near Bodrai, Mahabubabad.
Cell: 9701912300, 9705412300

దిన పత్రిక
# తొలి సమయం
వాస్తవమే గమ్యం.. గమనం...

సంపుటి : 02 సంచిక : 69 | సోమవారం 10-03-2025 | ఎడిటర్ : వేముల అయోధ్య రాములు | పేజీలు : 4 | వెల : 5 రూ/..

## 11న బీఆర్ఎస్ శాసనసభ పక్ష సమావేశం



హైదరాబాద్ : అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల నేపథ్యంలో ఈనెల 11 వ తేదీ (మంగళవారం) నాడు మధ్యాహ్నం ఒంటి గంటకు బీఆర్ఎస్ శాసనసభాపక్షం సమావేశం జరగనుంది. పార్టీ అధినేత కేసీఆర్ అధ్యక్షతన తెలంగాణ భవన్‌లో జరగనుంది. ఈ సమావేశానికి పార్టీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు హాజరుకానున్నారు.

## ఉపరాష్ట్రపతి ధన్‌ఖడ్‌కు అస్వస్థత




ఉప రాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖడ్ అస్వస్థతకు గురయ్యారు. శనివారం అర్ధరాత్రి దాటాక ఆయనకు ఛాతీ నొప్పి రావడంతో కుటుంబ సభ్యులు, వ్యక్తిగత సిబ్బంది హుటాహుటిన ఢిల్లీలోని ఎయిమ్స్ ఆస్పత్రికి తలించినట్టు సంబంధిత వర్గాలు తెలిపాయి. కార్డియాలజీ విభాగాధిపతి డాక్టర్ రాజీవ్ నారంగ్ ఆధ్వర్యంలో క్రిటికల్ కేర్ యూనిట్ (సీసీయూ)లో వైద్య సేవలు అందిస్తున్నట్లు ఆ వర్గాలు పేర్కొన్నాయి. ఆదివారం ప్రధాని మోదీ ఎయిమ్స్‌కు వెళ్లి ధన్‌ఖడ్‌ను పరామర్శించారు. ఆయన ఆరోగ్య పరిస్థితిపై వైద్యులను అడిగి సమాచారం తెలుసుకున్నారు. ఆ తర్వాత ధన్‌ఖడ్ ఆరోగ్యంగా ఉండాలని, ఆయన త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. కేంద్ర ఆరోగ్య శాఖ మంత్రి జేపీ నడ్డా సైతం ఆస్పత్రికి వెళ్లి ధన్‌ఖడ్‌ను పరామర్శించారు.

# అభ్యర్థిత్వం అనూహ్యం..







## కాంగ్రెస్ ఎమ్మెల్సీ అభ్యర్థులుగా విజయశాంతి, అద్దంకి, శంకర్‌నాయక్

### ఎమ్మెల్యే కోటా అభ్యర్థులను ప్రకటించిన అధిష్ఠానం

### నేటితో ముగియనున్న నామినేషన్ల గడువు

**తొలి సమయం హైదరాబాద్,**

కాంగ్రెస్ అభ్యర్థుల ఎంపికపై ఉత్కంఠకు తెర పడింది. అయితే అనూహ్యంగా పార్టీ ఫైర్ బ్రాండ్ విజయశాంతి పేరు తెరపైకి వచ్చింది. కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీ అభ్యర్థులుగా టీపీసీసీ ప్రధాన కార్యదర్శి అద్దంకి దయాకర్, ఉమ్మడి నల్లగొండ జిల్లాకు చెందిన కాంగ్రెస్ సీనియర్ నేత, సుదీర్ఘకాలంగా డీసీసీ అధ్యక్షుడిగా పనిచేస్తున్న కేతావత్ శంకర్‌నాయక్, మాజీ ఎంపీ విజయశాంతి పేర్లను పార్టీ అధిష్ఠానం ఆదివారం ప్రకటించింది. ఒక సీటును మిత్రపక్షం సీపీఐకి కేటాయించింది. ఈ మేరకు ప్రతిపాదనను ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ఆమోదించినట్లు ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ (సంస్థాగత వ్యవహారాలు) ప్రకటించారు. మొత్తం ఐదు సీట్లకు ఎన్నికలు జరుగుతుండగా.. పార్టీకి ఉన్న సంఖ్యాబలాన్ని బట్టి నాలుగు సీట్లలో పోటీ చేస్తున్న కాంగ్రెస్.. అందులో ఒకటి మిత్రపక్షం సీపీఐకి కేటాయించింది. అసెంబ్లీ ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీ మేరకు మిత్రధర్మంలో భాగంగా ఆ పార్టీకి ఇచ్చింది. మొత్తంగా ఎమ్మెల్యేల కోటా ఎమ్మెల్సీ అభ్యర్థుల ఎంపికలో సామాజిక న్యాయానికి కాంగ్రెస్ పెద్దపీట వేసింది. ఎస్సీ, ఎస్టీతోపాటు ఒక మహిళకు అవకాశం కల్పించింది.

**రేవంత్‌రెడ్డి సూచించిన అభ్యర్థులకే!**

ఎమ్మెల్సీ అభ్యర్థిత్వాలను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వ్యూహాత్మకంగా తనకు కావాల్సిన వారికి దక్కించుకున్నారని ఆ పార్టీ వర్గాలు అంటున్నాయి. అద్దంకి దయాకర్‌కు సరైన సమయంలో అవకాశం కల్పిస్తామని రేవంత్‌రెడ్డి పలు సందర్భాల్లో ప్రస్తావించారు. మిగిలిన ఇద్దరు అభ్యర్థుల ఎంపికలోనూ ఆయన వ్యూహాత్మకంగా వ్యవహరించారని అంటున్నారు. వాస్తవానికి అభ్యర్థుల పేర్లను ఖరారు చేసేందుకు సీఎం రేవంత్‌రెడ్డి, టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్, ఉపముఖ్యమంత్రి భట్టివిక్రమార్క, మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఆదివారం ఉదయమే ఢిల్లీకి రావాల్సి ఉంది. అయితే ఏఐసీసీ అధ్యక్షుడు మల్లిఖార్జున ఖర్గే, ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ అందుబాటులో లేకపోవడంతో చివరి నిమిషంలో వారు పర్యటనను రద్దు చేసుకున్నారు. ఆన్‌లైన్‌లోనే అభ్యర్థుల ఖరారుకు సంబంధించిన చర్చలు జరిపారు. ఆ మేరకే కాంగ్రెస్ అధిష్ఠానం అభ్యర్థుల జాబితాను ప్రకటించింది. కాగా, ఈ దఫా ఓసీలకు సీటు కేటాయించొద్దని అధిష్ఠానం నిర్ణయించడంతో ఎమ్మెల్సీ సీటుపై ఆశలు పెట్టుకున్న ప్రస్తుత ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డికి నిరాశ ఎదురైంది. ఆయనతోపాటు రేసులో చివరిదాకా ఉన్న ప్రభుత్వ సలహాదారు వేం నరేందర్‌రెడ్డి, సీనియర్ నేత జెట్టి కుసుమ్‌కుమార్‌కూ నిరాశే ఎదురైంది.

**ఎట్టకేలకు అద్దంకికి అవకాశం..**

తెలంగాణ ఏర్పడిన దగ్గర్నుంచీ అద్దంకి దయాకర్‌ను ఊరిస్తూ వస్తున్న చట్టసభల్లో ప్రాతినిథ్యం.. ఎట్టకేలకు దక్కనుంది. 2014, 2018 ఎన్నికల్లో తుంగతుర్తి నియోజకవర్గం నుంచి పోటీ చేసిన దయాకర్ స్వల్ప తేడాతో ఓడిపోయారు. 2023 ఎన్నికల్లో తుంగతుర్తి సీటును మందుల సామేలుకు ఇచ్చిన అధిష్ఠానం.. అద్దంకికి ఎమ్మెల్సీ సీటు హామీ ఇచ్చింది. ఇటీవల రెండు సీట్లకు జరిగిన ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఒక సీటును తొలుత అద్దంకి దయాకర్‌కు ఖరారు చేసినా.. చివరి క్షణంలో అభ్యర్థిని మార్చేసింది. ఈ దఫా ఎమ్మెల్సీ సీటు కూడా చివరి వరకూ సస్పెన్స్‌గానే నిలిచింది. ఈ సీటును మాదిగకు కేటాయించాలా.. లేక మాలకు కేటాయించాలా అన్న తర్జన భర్జన నడిచింది. ఒక దశలో మాదిగ, మాల సామాజిక వర్గాలకు చెరోటి కేటాయించాలన్న అంశంపైనా చర్చ నడిచింది. అయితే సీపీఐకి ఒక సీటు కేటాయించడంతో రెండు సామాజిక వర్గాల్లో ఒక దానికే సీటు కేటాయించాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఆదివారం సీఎం రేవంత్, టీపీసీసీ చీఫ్ మహేశ్‌గౌడ్, డిప్యూటీ సీఎం భట్టివిక్రమార్క, మంత్రి ఉత్తమ్‌తో ఫోన్ ద్వారా చర్చలు జరిపిన అధిష్ఠానం.. చివరికి అద్దంకి దయాకర్ పేరును ఖరారు చేసింది. సీఎం రేవంత్‌రెడ్డి పట్టుదలతోనే అద్దంకి దయాకర్‌కు అభ్యర్థిత్వం లభించిందని పార్టీ వర్గాలు తెలిపాయి. సూర్యాపేట జిల్లా ఆత్మకూరు(ఎస్) మండలం నెమ్మికల్‌కు చెందిన దయాకర్ అద్దంకి దయాకర్ విద్యార్థి దశ నుంచి సామాజిక, విద్యార్థి ఉద్యమాల్లో పనిచేశారు. తొలుత వెండితెరపై, ఆ తర్వాత రాజకీయాల్లోనూ ఫైర్‌బ్రాండ్‌గా కొనసాగిన విజయశాంతి.. ఎమ్మెల్సీ అభ్యర్థుల రేసులో అనూహ్యంగా తెరపైకి వచ్చారు. ఇటీవల ఆమె అధిష్ఠానం పెద్దలను కలిసి తన అభ్యర్థిత్వం కోసం ప్రయత్నాలు చేసుకున్నారు. వాస్తవానికి తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత సోనియా సమక్షంలో బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస‌లో చేరిన విజయశాంతి.. 2018 ఎన్నికల తర్వాత బీజేపీలో చేరారు. అయితే ఆ పార్టీ రాజకీయాల్లో ఇమడలేక 2023 ఎన్నికలకు ముందు తిరిగి కాంగ్రెస్‌లో చేరారు. అయితే ఆమె చేరే సమయంలోనే పార్టీ అధికారంలోకి వచ్చాక ఎమ్మెల్సీ సీటు ఇస్తామని అప్పటి రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌చార్జి మాణిక్‌రావ్ ఠాక్రే హామీ ఇచ్చారు. అధిష్ఠానాన్ని కలిసిన విజయశాంతి ఈ హామీని గుర్తు చేసినట్లు చెబుతున్నారు. ఈ హామీతోపాటు బీసీ మహిళ కోటాలో విజయశాంతిని అభ్యర్థిగా అధిష్ఠానం నిర్ణయించింది. అయితే విజయశాంతిని కాంగ్రెస్ ఎమ్మెల్సీ అభ్యర్థిగా ప్రకటించడంతో ఆమె మూలాలకు సంబంధించిన అంశం మరోసారి తెరపైకి వచ్చింది. 2005లో తల్లి తెలంగాణపార్టీని స్థాపించిన తొలిరోజుల్లో తన స్వస్థలం ములుగు జిల్లాలోని ఏటూరునాగారం మండలం రామన్నగూడెంగా విజయశాంతి ప్రకటించుకున్న సంగతి తెలిసిందే.కేతావత్ శంకర్‌నాయక్.. సామాన్య కార్యకర్త స్థాయి నుంచి ఎదిగారు. ప్రస్తుతం నల్లగొండ డీసీసీ అధ్యక్షుడిగా పనిచేస్తున్న శంకర్‌నాయక్.. జానారెడ్డికి సన్నిహితుడిగా పేరుంది. దీనికితోడు టీపీసీసీ చీఫ్ మహేశ్‌గౌడ్, మంత్రి ఉత్తమ్ ఆయన అభ్యర్థిత్వానికి మద్దతుగా నిలిచారు. పార్టీలో 30ఏళ్ల సీనియారిటీ ఉండడం కూడా శంకర్‌నాయక్‌కు కలిసొచ్చింది. శంకర్‌నాయక్ స్వగ్రామం నల్లగొండ జిల్లాలోని కేతావత్ తండా. డిగ్రీ పూర్తయిన వెంటనే యూత్ కాంగ్రెస్ నాయకుడిగా ప్రస్థానం ప్రారంభించిన శంకర్‌నాయక్ రాజకీయాల్లో చురుగ్గా వ్యవహరించేవారు. సొంత మండలం దామరచర్ల నుంచి రెండు పర్యాయాలు జడ్పీటీసీ సభ్యుడిగా, ఒక పర్యాయం ఎంపీపీగా ఎన్నికయ్యారు. మూడు పర్యాయాలూ జనరల్ స్థానం నుంచే శంకర్‌నాయక్ ఎన్నికవడం రాజకీయాల్లో అప్పట్లో విశేషంగా చెప్పుకొన్నారు. ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీ ఎన్నికల్లో నామినేషన్లు దాఖలు చేసేందుకు తుది గడువు సోమవారం సాయంత్రం 3 గంటలకు ముగియనుంది.

## రేవంత్‌రెడ్డీ.. పైశాచికానందం నీదే!

### మాజీ మంత్రి హరీశ్ రావు

**హైదరాబాద్, మార్చి 9:**




"ప్రజలను ఇబ్బందిపెట్టి ఎవరు పైశాచికానందం పొందుతున్నారు రేవంత్‌రెడ్డీ.. హైడ్రా పేర ఇళ్లను కూలగొట్టి నువ్వు పైశాచికానందం పొందావు. లగచర్ల గిరిజన రైతులకు బేడీలు వేయించావ్. ఆశా వర్కర్లను పోలీసులతో ఎగిరెగిరి కొట్టించావ్. పేరు మర్చిపోయారని అల్లు అర్జున్‌ను అరెస్టు చేసి, అశోక్‌నగర్‌లో నిరుద్యోగుల వీపులు పగలగొట్టి, గుమ్మడి నర్సయ్య నాలుగుసార్లు వస్తే అపాయింట్‌మెంట్ ఇవ్వకుండా పైశాచికానందం పొందింది నువ్వే" అంటూ సీఎం రేవంత్‌రెడ్డిపై మాజీ మంత్రి హరీశ్ రావు విరుచుకు పడ్డారు. ఆదివారం తెలంగాణ భవన్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ.. ఎస్ఎల్‌బీసీ టన్నెల్ ప్రమాదంలో కార్మికులు మరణిస్తే ఆనందం పొందే స్థితిలో కేసీఆర్, బీఆర్ఎస్ నేతలు లేరన్నారు. 16 రోజులవుతున్నా 8 మంది ప్రాణాల గురించి ఈ ప్రభుత్వానికి పట్టింపు లేకుండా పోయిందని విమర్శించారు. రేవంత్ రెడ్డి పాలన చేతగాక ప్రకృతిపై కూడా నిందలు వేస్తున్నారని, ఎండలకు పంటలు ఎండుతున్నాయంటూ చెబుతున్నారని మండిపడ్డారు. కేసీఆర్ సీఎంగా ఉన్నపుడు ఎండలు లేవా? అని నిలదీశారు. ఇదిలా ఉండగా, రాష్ట్ర అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల నేపథ్యంలో కేసీఆర్ అధ్యక్షతన బీఆర్ఎస్ శాసనసభాపక్ష సమావేశం మంగళవారం మధ్యాహ్నం జరగనుంది. తెలంగాణ భవన్‌లో జరగనున్న ఈ సమావేశానికి పార్టీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు హాజరుకానున్నారు. బడ్జెట్ సమావేశాల్లో ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు అనుసరించాల్సిన విధానం.. పార్టీ వైఖరిపై కేసీఆర్ ఈ సందర్భంగా దిశానిర్దేశం చేయనున్నారు.

## ఎస్ఎల్‌బీసీ టన్నెల్‌లో మృతదేహం లభ్యం

- సొరంగంలో 7 లేయర్ల కింద గుర్తింపు - టీబీఎం ఆపరేటర్‌గా గురుప్రీత్ విధులు
- స్వస్థలం.. పంజాబ్‌లోని చీమాకలాన్- 25 లక్షల పరిహారం ప్రకటించిన సీఎం
- మిగతా ఏడుగురి కోసం గాలింపు - మరో 2 ప్రాంతాల్ని గుర్తించిన జాగిలాలు

**మహబూబ్‌నగర్ మార్చి 9:** ఎస్ఎల్‌బీసీ టన్నెల్ ప్రమాదంలో గల్లంతైన ఎనిమిది మందిలో.. 16 రోజుల సహాయక చర్యల తర్వాత ఒకరి మృతదేహం లభ్యమైంది. మృతుడిని ర్యాబిన్స్ ఆపరేటర్ గురుప్రీత్‌సింగ్‌గా గుర్తించారు. ఆయన స్వస్థలం పంజాబ్‌లోని చీమాకలాన్. కేరళ నుంచి తెప్పించిన క్యాడవర్ డాగ్స్ గుర్తించిన చోటే.. గురుప్రీత్ మృతదేహం లభ్యమైంది. శనివారం రాత్రి సహాయక బృందాలకు ఓ చేయి కనిపించగా.. కాంక్రీట్ మాదిరిగా గట్టిపడ్డ మట్టిలోంచి.. దెబ్బతినకుండా మృతదేహాన్ని తీసేందుకు సహాయక బృందాలు సుమారు 12 గంటల పాటు శ్రమించాయి. మృతదేహం నిలువున ఉన్నట్లు గుర్తించి, 12 అడుగుల మేర తవ్వకాలు జరిపాయి. టీబీఎంకు చెందిన వ్యర్థాలను సైతం.. ఏడు లేయర్ల మేర తొలగించాక, గురుప్రీత్‌సింగ్ మృతదేహం లభ్యమైంది. ఆదివారం సాయంత్రం 4 గంటలకు మృతదేహాన్ని తీయగా.. 6 గంటలకు టన్నెల్ నుంచి బయటకు తీసుకువచ్చి, పోస్టుమార్టం నిమిత్తం అంబులెన్స్‌లో నాగర్‌కర్నూల్ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఆదివారం అర్ధరాత్రే పోస్టుమార్టం ప్రక్రియ పూర్తవ్వగా.. మృతదేహాన్ని పంజాబ్‌కు తరలించారు. గత సోమవారం నుంచి గాలింపును తీవ్రతరం చేయగా.. జీపీఆర్ రాడార్లు, ఆక్వా-ఐ యంత్రాలు, స్నిఫర్ డాగ్స్, కేరళ నుంచి తెప్పించిన క్యాడవర్ శునకాలను వినియోగించారు. జీపీఆర్ గుర్తించిన ఐదు ప్రాంతాల్లో కొన్ని చోట్ల తవ్వకాలు జరిపినా.. గల్లంతైన వారి ఆచూకీ లభించలేదు. గురువారం రంగంలోకి దిగిన క్యాడవర్ డాగ్స్ రెండు ప్రాంతాలను గుర్తించాయి. వాటిల్లో ఓ ప్రాంతం ప్రమాద స్థలికి చేరువలో ఉంది. సింగరేణి, ర్యాట్ మైనర్లు చెరో ప్రాంతంలో తవ్వకాలు జరిపారు. శనివారం రాత్రి ఓ చేయి ఉన్నట్లు ఎన్‌డీఆర్ఎఫ అసిస్టెంట్ కమాండెంట్ హరీశ్ గుర్తించడంతో.. తవ్వకాలు జరిపారు. ఈ ప్రాంతం టన్నెల్‌లో 13.8 కిలోమీటర్ల దూరంలో.. టీబీఎంకు 50 మీటర్ల దూరంలో ఉన్నట్లు అధికారులు తెలిపారు. క్యాడవర్ డాగ్స్ గుర్తించిన మరో ప్రాంతం టీబీఎంకు 16 మీటర్ల దూరంలో ఉంది. ఆదివారం ఈ శునకాలు మరో రెండు ప్రాంతాలను గుర్తించాయి. ఈ మూడు చోట్ల తవ్వకాలు కొనసాగుతున్నాయి. అయితే.. ఈ ప్రాంతం సున్నితంగా ఉందని సింగరేణి మైనర్లు చెబుతున్నారు. ఈ 3 ప్రాంతాలు టీబీఎం నుంచి 10-16మీటర్ల దూరంలో ఉన్నాయి. అక్కడ ఊట నీటిని తొలగిస్తుండగా.. మిగతా మట్టి కాంక్రీట్ మాదిరిగా గట్టిగా తయారవుతూ తవ్వకాలకు ఆటంకంగా మారిందని వివరిస్తున్నారు. దీంతో.. సహాయక బృందాలపై పైనుంచి మట్టి పెళ్లలు కూలకుండా ఉండేందుకు దుంగలను తెప్పించారు. వీటిని సపోర్ట్‌గా వినియోగించి, తవ్వకాలు జరుపుతారు. క్యాడవర్ డాగ్స్ గుర్తించిన మూడు ప్రాంతాల్లో 15 అడుగుల మేర మట్టిని తవ్వాల్సి ఉందని అధికారులు చెప్పారు.



**క్యాడవర్ డాగ్స్ రాక**

టన్నెల్‌లో చిక్కుకుపోయిన వారిని గుర్తించేందుకు 16 రోజులుగా 12 ఏజెన్సీలకు చెందిన బృందాలు శ్రమిస్తున్నాయి. జీపీఆర్ రాడార్, ఆక్వా-ఐ పరికరాలను గుర్తించినా.. గల్లంతైన వారిని గుర్తించడం సాధ్యం కాలేదు. దీంతో.. కేరళ పోలీసులు వినియోగించే క్యాడవర్ డాగ్స్‌ను రప్పించారు. బెల్జియం మెలినోయిస్ జాతికి చెందిన మాయ, మార్ఫి అనే శునకాలను కేరళ బృందాలు రంగంలోకి దింపాయి. కేరళలో ప్రకృతి వైపరీత్యాలు, కొండచరియలు విరిగిపడే ప్రమాదాలు ఎక్కువగా ఉండడంతో.. సుమారు 17 శునకాలను కొనుగోలు చేసి, వాటికి మానవ అవశేషాలను గుర్తించడంలో శిక్షణనిచ్చారు. ఇవి మానవ, జంతు కళేబరాల అవశేషాలను వేర్వేరుగా గుర్తిస్తాయి. నెలలు, సంవత్సరాలు దాటి.. ఎముకలు మాత్రమే భూగర్భంలో ఉన్నా.. ఇవి గుర్తిస్తాయి.

**25 లక్షల పరిహారం ప్రకటించిన సీఎం**

హైదరాబాద్, మార్చి 9(ఆంధ్రజ్యోతి): గురుప్రీత్‌సింగ్ కుటుంబానికి సీఎం రేవంత్‌రెడ్డి రూ.25 లక్షల నష్టపరిహారం ప్రకటించారు. ఆయన మృతిపట్ల సీఎం రేవంత్, మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి సంతాపం తెలిపారు. మృతదేహాన్ని పంజాబ్‌కు తరలించామని చెప్పారు. రెవెన్యూ అధికారి రూ.25 లక్షల చెక్కును సిద్ధం చేసి, పంజాబ్‌లోని గురుప్రీత్‌సింగ్ కుటుంబానికి అందజేసేందుకు ఇద్దరు సహాయకులను మృతదేహంతో పాటు పంపించామన్నారు. కాగా.. సహాయక చర్యల్లో సీఎం వైఫల్యం, కాంట్రాక్టు సంస్థ నిర్లక్ష్యంతోనే ఈ ఘోరం జరిగిందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆరోపించారు. ప్రభుత్వం, కాంట్రాక్టు సంస్థ చెరో రూ.50 లక్షల చొప్పున రూ.కోటి పరిహారం అందించి, మృతుడి కుటుంబాన్ని ఆదుకోవాలని డిమాండ్ చేశారు.

**మొదటిరోజు చేయి కనిపించిన చోటే..**


ఎస్ఎల్‌బీసీ టన్నెల్ ప్రమాదం జరిగిన మొదటిరోజు లభించిన ఫొటోల్లోనే ఒక చేయి కనిపించింది. 'ఆంధ్రజ్యోతి'లో ఆ ఫొటో ప్రచురితమైంది. ప్రమాద సమయంలో భయంతో పరుగులు పెట్టిన కార్మికుల్లో ఒకరు తీసిన ఫొటో అది. అందులో ఒక చేయి ఉన్నట్లు స్పష్టంగా కనిపించింది. ఆ తర్వాత మరోసారి పైకప్పు కూలడంతో ఆ చేయి ఉన్న ప్రాంతాన్ని గుర్తించడం సాధ్యం కాలేదు. తాజాగా జీపీఆర్‌తోపాటు క్యాడవర్ డాగ్స్ ఆ ప్రాంతాన్ని గుర్తించడంతో అక్కడ తవ్వకాలు చేపట్టి, గుర్‌ప్రీత్‌సింగ్ మృతదేహాన్ని వెలికి తీశారు.

## నేటి నుంచే పార్లమెంటు

### మణిపూర్‌లో రాష్ట్రపతి పాలనకు

### లోక్‌సభ ఆమోదం కోరనున్న అమిత్ షా

**న్యూఢిల్లీ, మార్చి 9:** పార్లమెంటు రెండో విడత బడ్జెట్ సమావేశాలు వాడీవేడిగా జరగనున్నాయి. సోమవారం నుంచి ప్రారంభమయ్యే సమావేశాలు రణరంగాన్ని తలపించే అవకాశాలు ఉన్నాయి. అధికార బీజేపీ, ప్రతిపక్ష సభ్యుల మ?ధ్య తొలి రోజు నుంచే వాగ్యుద్ధాలు జరగనున్నాయి. హింసాకాండతో అతలాకుతలమైన మణిపూర్‌లో విధించిన రాష్ట్రపతి పాలనకూ కేంద్ర హోంమంత్రి అమిత్ షా సోమవారమే లోక్‌సభ ఆమోదముద్ర కోరనున్నారు. ఆ తర్వాత ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ మణిపూర్‌కు సంబంధించి బడ్జెట్ ప్రతిపాదనలను ప్రవేశపెట్టబోతున్నారు. ఇక ప్రతిపక్షాలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్న వక్ఫ్ బిల్లు కూడా ఈ సమావేశాల్లోనే పార్లమెంట్ ముందుకు రానుంది. మణిపూర్‌లో రెండేళ్లుగా జరుగుతున్న హింసను అదుపు చేయలేక.. గత నెలలో ముఖ్యమంత్రి బీరేన్ సింగ్‌తో రాజీనామా చేయించి, రాష్ట్రపతి పాలన విధించాల్సి రావడంపై ప్రతిపక్షాలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి. మణిపూర్‌లో హింసాకాండ ఆగకపోవడంపై సర్కారును నిలదీయనున్నాయి. మరోవైపు వక్ఫ్ బిల్లును పరిశీలించేందుకు వేసిన సంయుక్త పార్లమెంటు కమిటీ (జేపీసీ)లో తమ అభ్యంతరాలను తిరస్కరించి కేవలం ఎన్డీయే సభ్యుల ఆమోదంతో బిల్లుకు ఆమోదముద్ర వేసినందుకు ప్రతిపక్ష సభ్యులు గత సమావేశాల్లోనే గందరగోళం సృష్టించారు. ప్రతిపక్షాలు ఎంత గొడవ చేసినా సాధ్యమైనంత త్వరలో వక్ఫ్ బిల్లును చట్టం చేయాలని ప్రభుత్వం నిర్ణయించినట్లు పార్లమెంట్ వ్యవహారాల మంత్రి కిరెణ్ రిజిజు ఇప్పటికే ప్రకటించారు. ఇండియా కూటమి పార్టీలన్నీ వక్ఫ్ బిల్లును వ్యతిరేకించేందుకు వ్యూహ రచన చేస్తాయని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్ ప్రకటించారు. సోమవారం రాజ్యసభలో రైల్వే సవరణ బిల్లు, సహకార సంఘాల్లో పనిచేసే వ్యక్తులకు తగిన శిక్షణను అందించేందుకు త్రిభువన్ సహకారీ బిల్లును కూడా ప్రవేశపెట్టనున్నారు. మరోవైపు నియోజకవర్గాల పునర్విభజన, త్రిభాషా సూత్రం ద్వారా హిందీని దక్షిణాదిపై రుద్దడం, భారత్‌పై అమెరికా టారిఫ్‌లు విధించడంపై కూడా ప్రతిపక్షాలు ప్రభుత్వాన్ని నిలదీసేందుకు సిద్ధంగా ఉన్నాయి. జనాభా ప్రాతిపదికన పునర్విభజన చేపట్టరాదని డీఎంకే సహా పలు పార్టీలు డిమాండ్ చేయనున్నాయి.




## నకిలీ పురుగుమందుల ముఠాపై జాగ్రత్త

### పి. వాహిని మండల వ్యవసాయ అధికారి

**తొలి సమయం దంతాలపల్లి మార్చ్ 9**
దంతాలపల్లి మండలంలోని పలు గ్రామాలలో (వేములపల్లి, కుమ్మరి కుంట్ల, రేపోణి) తక్కువ ధరకే మంచి కంపెనీ మందులు( పెస్టిసిడ్స్) అని చెప్పి రైతులకు నకిలీ మందులు అమ్మడం జరుగుతుంది. ఈ ముఠాకు సంబంధించిన వ్యక్తి గుంజ సైదులు అనే, వ్యక్తి తుంగతుర్తి మండలం సంగెం గ్రామం, సూర్యాపేట జిల్లా కు చెందిన వ్యక్తి గ్రామాలలో తిరుగుతూ రైతులను నేరుగా సంప్రదించి ఈ మందుల అమ్మకాలు చేయడం జరుగుతుంది. ఇతని మీద పెద్ద వంగర పోలీస్ స్టేషన్లో కేసు కూడా నమోదు కావడం జరిగింది.కావున రైతులెవరు ఇలాంటి వ్యక్తులు అమ్మే నకిలీ మందులను కొనుగోలు చేసి మోసపోకూడదు. ఈ విధంగా ఎవరైనా గ్రామాల్లో తిరుగుతూ మందులను అమ్మే ప్రయత్నం చేస్తుంటే వెంటనే వ్యవసాయ శాఖ వారికి గాని పోలీసు శాఖ వారికి సమాచారం అందించగలరు అని పి. వాహిని దంతాలపల్లిమండల వ్యవసాయ అధికారి తెలిపారు.

## చెవిటి వెంకన్న కుమార్తె వివాహ వేడుక

### పిఎసిఎస్ చైర్మన్ సంపేట రాము గౌడ్



**తొలి సమయం దంతాలపల్లి మార్చ్ 9**
సూర్యాపేట జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మరియు తెలంగాణ రాష్ట్ర రైతు వ్యవసాయ సంక్షేమ కమిషన్ సభ్యుడు చెవిటి వెంకన్న కుమార్తె వెన్నెల ప్రవీణ్ దంపతుల వివాహ వేడుకకు దంతాలపల్లి పిఎసిఎస్ చైర్మన్ సంపేట రాముహాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో మండల యూత్ అధ్యక్షుడు సంపేట సురేష్ గౌడ్ దుండి వెంకటేశ్వర్లు సంపెట అశోక్ తదితరులు పాల్గొన్నారు.


## పిడిఎఫ్ బియ్యం పట్టివేత



**తొలి సమయం తొర్రూరు మార్చి 9**
పెద్ద వంగర మండలం ఉదయం తెల్లవారు జామున కొరిపల్లి క్రాస్ రోడ్ వద్ద పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా సమాచారం మేరకు మేకల నాగయ్య తండ్రి లాలయ్య 29 కులం : మాల డ్రైవర్, రుద్రాయగూడెం గ్రామం, గుండ్లపల్లి మండలం, నల్గొండ జిల్లా అను వ్యక్తి ఐతే కృష్ణ, గ్రామం కొత్తపేట, హైదరాబాద్ చెంది ఐచర్ డీసీఎం వ్యాన్ లో 50 కిలోల బ్యాగులు 240 పిడిఎస్ రైస్ ను హైదరాబాద్ కు తరలిస్తుండగా పట్టుకోవడం జరిగింది. పంచుల సమక్షంలో పంచనామ నిర్వహించి పిడిఎస్ రైస్ ను సీజ్ చేసి పోలీస్ స్టేషన్ నందు ఉంచనైనది మరియు అట్టి ఇద్దరు వ్యక్తుల పై కేసు నమోదు చేయడం జరిగింది. పెద్ద వంగర ఎస్సై తెలిపారు

### నూతన వధూవరులను ఆశీర్వదించిన

## మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు



**తొలి సమయం తొర్రూరు మార్చి 9**
పెద్దవంగర మండల కేంద్రానికి చెందిన పులుగుర్ల మహేష్ తండ్రి కుమార్ వివాహం సాయి ఫంక్షన్ హాల్ లో జరగగా ఈ వివాహ వేడుకకి హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించిన మాజీ మంత్రి వర్యులు ఎర్రబెల్లి దయాకర్ రావు ఈ కార్యక్రమంలో జిల్లా,మండల, గ్రామ నాయకులు పాల్గొన్నారు.

# పిఆర్‌టి యుటిఎస్ ఆధ్వర్యంలో మహిళా దినోత్సవ సంబరాలు






**తొలి సమయం, మహబూబాబాద్ మర్చి 9:**
స్థానిక కంకరబోడ్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మండలంలోని పి ఆర్ టి యు టి ఎస్ మహబూబాబాద్ మండల శాఖ అధ్యక్ష ,ప్రధాన కార్యదర్శులు అయిన భూక్య రామోజీ నాయక్ మరియు కాపరబోయిన సుజాత ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన పి ఆర్‌టియు టి ఎస్ జిల్లా అధ్యక్షులు శ్రీ సంకా బద్రి నారాయణ జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు.

అనంతరం వారు మాట్లాడుతూ ,"మహిళా సాధికారత సాధించాలంటే మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని , తమకు ఎదురయ్యే సమస్యలను నిర్భయంగా ఎదుర్కోవాలని, సమాజంలో తమ వంతు పాత్ర పోషించాలని మహిళా లోకానికి సూచించారు". అనంతరం డీఎస్సీ 2024 ద్వారా ఎంపిక కాబడిన నూతన ఉపాధ్యాయ సోదరిమణులకు, ఇన్స్పైర్ లో మండలం నుండి ఎంపిక కాబడిన ప్రాజెక్టు బాధ్యులకు, ప్రమోషన్ పొంది ఇతర మండలాలకు వెళ్లిన వారికి, ఇటీవల పదవీ విరమణ పొందిన మహిళ ఉపాధ్యాయురాలు శ్రీదేవి పిఆర్‌టియు సీనియర్ సభ్యులకు, సన్మాన కార్యక్రమం నిర్వహించి, శాలువా మరియు జ్ఞాపికలతో ఘనంగా సత్కరించారు.ఇంకా ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు కోట్యా గారు, ఆల్ ఇండియా ఫెడరేషన్ టీచర్స్ ఆర్గనైజేషన్ ఉపాధ్యక్షులు, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు గీత, ఉమ, మరియు శ్యామల దేవి , మండల మహిళా ఉపాధ్యక్షులు కౌసల్య, కార్యదర్శి సుశీల మరియు పి ఆర్ టి యు కు చెందిన మహిళా సభ్యులు పాల్గొన్నారు.

# "బాలకుమార స్వామి జాతర భవిష్యత్తు నిర్వాహణ" పై

## సమీక్ష సమావేశం నిర్వహించిన చుంచు వంశస్తులు

**సమిష్టి కృషి తోనే జాతర అభివృద్ధి**

**-కమ్యూనిటీ హాల్, స్టాక్ రూమ్ ఏర్పాటుకు ప్రకటన చేసిన మంత్రి సీతక్కను కలిసి ఏర్పాటు పూర్తి చెయ్యాలి**

**జాతర అభివృద్ధి కోసం పార్టీలు, రాజకీయాలకు అతీతంగా కేంద్రం రాష్ట్ర ప్రభుత్వాల సహకారం తీసుకోవాలి**

**కోయ పుణ్యం ధర్మ, ప్రచారక్, ఆదివాసీ 9తెగల సమన్వయకర్త చుంచు రామకృష్ణ**





**తొలి సమయం మహబూబాబాద్ మార్చి 9:**
బాల కుమారస్వామి జాతర నిర్వహణ క్షేత్ర అభివృద్ధి కోసం పూర్తిస్థాయి కమిటీ వేయాలని కోయ పుణ్యం ధర్మ ప్రచార చుంచు రామకృష్ణ సూచన చేసారు. మహబూబాబాద్ జిల్లా గంగారం మండలం మడ గూడెం గ్రామం చుంచు ఇలవేల్పు శ్రీ బాల కుమారస్వామి జాతర గద్దెల ప్రాంగణం వద్ద కోయ పుణ్యం ధర్మ ప్రచార చుంచు రామకృష్ణ ఆధ్వర్యంలో చుంచు వంశస్తులచే సమీక్ష సమావేశం నిర్వహించారు. జాతర భవిష్యత్తు ప్రణాళిక పై అందరి అభిప్రాయాల సేకరణ చేశారు, వ్యక్తిగత అభిప్రాయాలు. రాజకీయాలు పార్టీలకతీతంగా ఐక్యంగా పనిచేయడం వలన మాత్రమే జాతర అభివృద్ధి అవుతుందని అన్నారు, అదేవిదంగా కేంద్రం రాష్ట్ర ప్రభుత్వ సహకారం తీసుకోవాలని అన్నారు . సమీక్ష సమావేశ తీర్మాణాలు ఇలా ఉన్నాయి..రాష్ట్ర గ్రామీణ అభివృద్ధి శాఖ మంత్రి సీతక్క ప్రకటించిన కమ్యూనిటీ హాల్ స్టాక్ రూమ్ ఏర్పాటుకు త్వరలో ఆమెను కలిసి ధన్యవాదములు తెలిపి ఏర్పాటు పూర్తి చేసుకోవాలి. వచ్చే జాతరకు సంబంధించి అన్ని కమిటీలను డిసెంబర్ లోపు ఏర్పాటు చేసుకోవాలి జాతరలో జరిగిన లోటుపాట్లను ఎలా సవరించు కోవాలి అనే దానిపై సమావేషం ఏర్పాటు చేసి తలపతి వడ్డీ గ్రామ పటేల్ దొర వడ్డె పేరంటాలు నిర్ణయాలు చేసి ప్రతి ఒక్కరికి సోషల్ మీడియా ద్వారా తెలియజేయాలి. చుంచు వంశస్థుల ఉద్యోగులు జాతర ఆర్థిక పరమైన అంశముపై బాధ్యతలు తీసుకొని మిగతా వేల్పుల ఉద్యోగులకు ఆదర్శంగా నిలవాలని పేర్కొన్నారు.జాతర అభివృద్ధి కి అన్ని రకాల జాగ్రత్తల పై ఈ సమీక్షా సమావేశం లో చర్చించారు, కమ్యూనిటీ హాల్ మరియు స్టాక్ రూమ్ ఏర్పాటుకు ప్రకటన చేసిన సీతక్కకు ధన్యవాదాలు తెలిపారు ఈ సమీక్ష సమావేశంలో చుంచు సారయ్య, సారంగపాణి. దళపతి చుంచ శ్రీనివాస్ మహేందర్ రాజు స్వామి లక్ష్మయ్య సుధాకర్ దయాకర్ ఎర్రయ్య పెద్ద లక్ష్మయ్య రీసెర్చ్ స్కాలర్స్ చుంచు బాలకృష్ణ విజయ్ వడ్డెలు పూజారులు గ్రామస్తులు పాల్గొన్నారు.



### వివాహ వేడుకలో పాల్గొన్న

## ఎమ్మెల్యే యశస్విని రెడ్డి, కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి ఝాన్సీ రెడ్డి



**తొలి సమయం తొర్రూరు మార్చి 9**
సూర్యాపేట జిల్లా డీసీసీ అధ్యక్షులు చెవిటి వెంకన్న యాదవ్ కూతురి వివాహం తొర్రూర్ యూత్ మండల అధ్యక్షులు పయ్యావుల ప్రవీణ్ యాదవ్ తో సూర్యాపేట జిల్లా కేంద్రంలోని బాలాజీ గార్డెన్లో జరగగా వివాహ వేడుకలో పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలిపిన పాలకుర్తి శాసన సభ్యురాలు యశస్విని రెడ్డి నియోజకవర్గం ఇంచార్జ్ ఝాన్సీ రెడ్డి వెంట.నియోజకవర్గం నాయకులు, సీనియర్ నాయకులు, వివిధ మండల పట్టణ అధ్యక్షులు, యువజన నాయకులు, మహిళా నాయకులు, తదితరులు, ఉన్నారు..

## కాంగ్రెస్ మీడియాను మానేజ్ చెయడంలో వెనుక బాటు

**తొలి సమయం, మహబూబాబాద్ మర్చి9** కాంగ్రెస్ ప్రభుత్వం రావాలి, జిల్లా ప్రజలు స్వేచ్ఛగా శ్వాస పీల్చుకోవాలి, పోలీస్ స్టేషన్ లు సామాన్యుల పక్షాన నిలిచి ఎప్పటి ప్రశాంత వాతావరణం రావాలంటూ... అనేక కదనాలు రాసి కాంగ్రెస్ ప్రభుత్వం గెలుపుకు కృషి చేసిన జర్నలిస్టులు ఉన్నారు. ప్రత్యేక దృక్పధం కలిగిన జర్నలిస్టులు ఉన్నారు. కనీసం జర్నలిస్ట్ ల తో సమకాలీన రాజకీయాలు, ప్రజా స్వామిక వాతావరణం భలోపేతం పై ఎనాడైనా సమాలోచన చేయక పోవడాన్ని, జిల్లా కాంగ్రెస్ పై జర్నలిస్టుల్లో ఒకింత విచారం వ్యక్తం అవుతోంది.గెలిచాక గత పాలన కు భిన్నంగా ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం మీడియా పట్ల చూపించిన ప్రత్యేకత ఏమి లేక పోవడం, పై కొంత మంది జర్నలిస్టుల్లో ఆసక్తి కరమైన చర్చలకు తావిస్తోంది.విమర్శలు లు స్వీకరిస్తూ.. మీడియా లో వస్తున్న కదనాలను సద్విమర్శలుగా భావించి సూచనలు పరిగణలోకి తీసుకుంటే బాగుంటుంది అనే అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి.

## ప్రణయ్ హత్య కేసుపై తీర్పు నేడు

**నల్లగొండ క్రైం, మార్చి 9:** ఉభయ తెలుగు రాష్ట్రాల్లో సంచలనం సృష్టించిన నల్లగొండ జిల్లా మిర్యాలగూడకు చెందిన పెరుమాళ్ల ప్రణయ్ హత్య కేసుపై తీర్పును ఎస్సీ, ఎస్టీ రెండో అదనపు జిల్లా కోర్టు సోమవారం వెల్లడించనుంది. అమృత వర్షిణి, ప్రణయ్‌లు ప్రేమవివాహం చేసుకున్నారు. కులాలు వేరు కావడంతో వీరి వివాహాన్ని అమృత తండ్రి మారుతీరావు ఒప్పుకోలేదు. మారుతీరావు.. సుపారీ గ్యాంగ్‌తో 2018 సెప్టెంబరు 14న ప్రణయ్‌ను హత్య చేయించాడు. కేసు నమోదు చేసిన పోలీసులు.. ప్రథమ నిందితుడు (ఎ-1)గా అమృత తండ్రి మారుతీరావు, సుపారీగ్యాంగ్‌కు చెందిన సుభాషశర్మ ఎ-2గా, ఎ-3గా అజ్గర్ అలీ, ఎ-4గా అబ్దుల్ భారీ, ఎ-5గా కరీం, ఎ-6గా అమృత బాబాయి శ్రవణ్, ఎ-7గా శివ, ఎ-8గా నదీమ్‌లను పేర్కొంటూ పోలీసులు కేసు దర్యాప్తు చేశారు. ఏడేళ్ల పాటు కోర్టులో విచారణ కొనసాగింది.

TEL TEL RNI NO 12283 VEMULA AYODHYA RAMULU TOLI PODDU PUBLICATIONS AND PRINTERS GRAPHICS
H-NO 1-6-155/43/45/4 NANDI NAGAR POST: MANDAL DIST: MAHABUBABAD TELANGANA STATE INDIA PIN CODE 506 101